


# కన్నబిడ్డల చదువుకు మలుపు

— వేదుల మీనాక్షీదేవి

"నిజంగా శ్రీలక్ష్మి వదిన అలాగ అన్నారా?" అడిగింది శ్యామల.

"నిజంగానే అంది" అన్నాడు జనార్దనం.

"ఆవిడ అంతట ఆవిడే అన్నారా? మీరు అడిగితే అన్నారా?" అంది భార్య.

"మేము వెళ్ళింది మొదలు కూడా కూడా తిరుగుతూ, సరదాగా కబుర్లు చెబుతూ ఉన్న మన అమ్మాయి సుగుణను చూసి ఇరుగు పొరుగు వారు 'ఈ అమ్మాయి ఎవరండీ? ఏమౌతుంది?' అని అడిగారు శ్రీలక్ష్మిని.

'మా మేనకోడలూ, కోడలూను. బి.ఎ. చదివింది. పిల్ల నాన్న నాకు పినతండ్రి కొడుకు!' అంది శ్రీలక్ష్మి.

'భలే కోడల్ని ఎన్నిక చేశారే! చదువుకున్న పిల్ల అని కాస్తంత గర్వం కూడా లేదు. సార్థకనామధేయురాలు' అంది ఒకామె.

'కాస్త వాక్చాతుర్యం ఉన్న ఆవిడ కాబోలు' అనుకున్నాను.

'కట్నం ఏపాటి పుచ్చుకుంటారు?' మరొకామె ప్రశ్నించింది.

'పిల్లవాడికి పిల్ల కట్నం. పిల్లకు పిల్లవాడు కట్నం?' అంది శ్రీలక్ష్మి.



Studio Amia/SC

'ఇటువంటి విషయాల్లో ఎవరో ఒకరు ముందడుగు వేస్తే మిగిలిన వాళ్ళు కూడా కట్నాలు పుచ్చుకోవడం మానేస్తారు' అన్నారు వచ్చిన వాళ్ళు.

"వాళ్ళు వెళ్ళిపోయారు.

'చెల్లాయీ! మొదటి నించి నీకు సుగుణ అంటే ఎంతో ఆపేక్ష. నీవంటి అభిమానం, ప్రేమ గల మేనత్తను అత్తగారుగా పొంద గలిగితే అది చాలా అదృష్టవంతురాలు. నీ కా అభిప్రాయం ఉండడం చాలా గొప్ప విషయం. యథాశక్తి కట్నం ఇస్తాను సుమా?' అన్నాను.

'అదేమిటిరా, అన్నయ్యా! అన్నాచెల్లెళ్ళ మధ్య ఇచ్చి పుచ్చుకోవడా లేమిటిరా?' అంది గలగల నవ్వుతూ శ్రీలక్ష్మి" అని వివరంగా విషయ మంతా చెప్పాడు జనార్దనం, శ్యామలతో.

చాలా కాలం నించి రమ్మంటున్నా వదువులో వెళ్ళడం కుదరలేదు సుగుణకు, శ్రీలక్ష్మిగారి ఇంటికి. పరీక్ష లయ్యాక తండ్రీ, కూతురూ వెళ్ళి నాలుగు రోజులు ఉండి వచ్చారు.

"క్షేమంగా వెళ్ళి లాభంగానే వచ్చారన్న మాట. బాగానే ఉంది. వెళ్ళిన వేళ మంచిది. ఆస్తి, అంతస్తు అంటూ కట్నం కోసం పట్టు పట్టేది ఆడవాళ్ళే అనుకునేదాన్ని కాని, శ్రీలక్ష్మి వదిన ఎంత సంస్కారవంతురాలు! సాటి వారి మనస్సులలో పరివర్తన తెచ్చే మార్గదర్శకురాలు ఈవిడే. ఒక తల్లి పిల్లలు కాకపోయినా మీరన్నా, మేమన్నా ఎంతో మమతానురాగాలు ఆవిడకు" అంది శ్యామల.

"మంచి రోజు చూసుకుని మధ్యవర్తి నెవరి నైనా తీసుకువెళ్ళి మన అమ్మాయి సుగుణను వాళ్ళ రెండవ పిల్లవాడు మురళికి ఇచ్చే ఉద్దేశం ఉన్నట్లు చెప్పడం మన ధర్మం. కట్నం వద్దంటే మాత్రం కొబ్బరి బోండం, పిల్లను చేతిలో పెడతామా? మన తాహతుకు తగినట్లుగా వరుడికి, వియ్యపురాలికి, ఆడబిడ్డకు ఘనంగా లాంఛనాలు జరిపిద్దాం" అంది శ్యామల.

మామగారిని తీసుకొని వెళ్ళి శ్రీలక్ష్మితోను, ఆమె భర్త గోవిందరావు తోను చెప్పి వచ్చాడు జనార్దనం.

వరుడు కలకత్తాలో ఒక ప్రైవేటు ఫరమ్‌లో ఇంజినీరుగా ఉద్యోగం చేస్తున్నాడు.

తాంబూలాలు పుచ్చుకుందుకు నిర్ణయించిన రోజుకు వరుని తీసుకుని శ్రీలక్ష్మి, గోవిందరావు వచ్చారు. శాస్త్రులుగారి నొకరిని కూడా తీసుకు వచ్చారు.

ఇటు శ్యామల తల్లి, తండ్రీ వచ్చారు.

వూళ్ళో పెద్దలను పిలిచారు తాంబూలాలు పుచ్చుకునే సమయంలో.

"అయితే, కట్నాలూ గట్రా ఇదివరకేమైనా మాట్లాడుకున్నారా?" అన్నారు శాస్త్రులుగారు, జనార్దనంతో.

"అలాంటి వాటికి మా చెల్లెలు వ్యతిరేకి. మన మధ్య ఇచ్చి పుచ్చుకోవడం ఏమిటి? అంది" అన్నాడు జనార్దనం, శ్రీలక్ష్మి వైపు నవ్వుతూ చూసి.

"అదేమిట్రోయ్! ఏదో మాట వరసకు అన్న మాట పట్టుకుని కూర్చున్నట్లున్నావు. కట్నం

లేకపోవడం ఏమిటి? పది వేలు కట్నం, రెండు వేలు లాంఛనాలు పై వాళ్ళు ఇస్తామన్న దాని కన్నా తక్కువే. బోలెడు డబ్బు పోసి ఇంజనీరు చదువు చెప్పించాం. అమెరికా కూడా వెళ్ళి వచ్చాడు. మేము ఖర్చు పెట్టిన దంతా రాబడతామనుకున్నావా? లోకం కోసం నామకః పుచ్చుకోవడం-అంతే" అంది నిర్మొహ మాటంగా.

ఆమె అలా అంటుందని వూహించని జనార్దనం, భార్య విస్తు పోయారు. అయితే, వాళ్ళు కట్నం వద్దన్నా పది వేల వరకు ఏదో రూపంలో ఇవ్వ దలుచుకునే ఉన్నారు. డబ్బు గురించి పెద్దగా ఆలోచించవలసిన దేమీ లేదు. లాంఛనాలతో సహా పది వేలు ఇస్తామని మధ్య వర్తిచేత చెప్పించారు. పై రెండు వేలూ తగ్గినందుకు గునుస్తూనే అంగీకరించింది శ్రీలక్ష్మి.

ఎనిమిది వేలు రొక్కం పుచ్చుకుని తాంబూలాలు పుచ్చుకున్నారు. మిగిలిన రెండు వేలూ లాంఛనాల నిమిత్తం ఖర్చు పెట్టమన్నారు. ముహూర్తం నిశ్చయించారు పెద్దలు.

• • • •

ఆడ పిల్లను ఎక్కువ చోట ఇవ్వాలి, తక్కువ చోట తెచ్చుకోవాలి అంటారు పెద్దలు. ఆ పద్ధతిలో శ్రీలక్ష్మి పుట్టింటివారు ఏమంత ధనవంతులు కాకపోయినా, గోవిందరావు తల్లితండ్రులు ఆ సంబంధం చేశారు. అప్పటికి అతడు ఇంటర్ చదువుతున్నాడు.

గోవిందరావు ఇంటర్ పాసయాడు.

శ్రీలక్ష్మి వచ్చిన వేళ మంచి దన్నారు అతని తల్లి, తండ్రీ. ఆ కారణం చేత శ్రీలక్ష్మి అతని పాలిటి అదృష్ట దేవత అనే భావానికి అంకురార్పణ జరిగింది.

పట్నంలో కాపురం పెట్టి బి. ఎ. చదివి డిగ్రీ సంపాదించాడు గోవిందరావు. ఆస్తిపరుడు. వూళ్ళో పార్టీలు, వర్గాలు, ఎన్నికల రాజకీయాలు మొదలైన విషయాలలో ఆరితేరి ఆ వూళ్ళో పంచాయతీ బోర్డు ప్రెసిడెంటుగా రెండు మార్లు ఎన్నికైనాడు. బాగా డబ్బు సంపాదించాడు.

ఇదంతా శ్రీలక్ష్మి చలవ అని గోవిందరావు దృఢ విశ్వాసం. ఆమె తనకన్న తెలివైన దంటాడు. పల్లెత్తు మాట అనడు. ఆమె వాక్కు, వేదవాక్కు. గీచిన గీటు దాట డంటారు ఎరిగి ఉన్న వారు.

ఆర్థిక విషయాలు పూర్తిగా ఆమె స్వాధీనం లోనే ఉంటాయి. ఆమె మాటకు తల వూపడమే గోవిందరావు చేసే పని. ఆమె ఎవరితోనైనా దెబ్బ లాడుతూంటే ఆమె తరఫున వెళ్ళి దెబ్బలాడతాడు. వీటన్నిటివల్ల శ్రీలక్ష్మికి తగని గర్వం అనీ, గంపెడు నోరనీ జనం చాటుగా చెప్పుకుంటూంటారు. ఆమె దాబుసరి కబుర్లకు నవ్వుకుంటూంటారు ఇరుగు పొరుగు వారు.

శ్రీలక్ష్మికి ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె. కుమార్తె పెద్దది. రెండవ వాడు వరుడు—మురళి.

• • • •

పెళ్ళివారికోసం విశాలమైన విడిది ఏర్పాటు చేశాడు జనార్దనం. వారికి కావలసిన సదుపాయాలన్నీ అమర్చాడు.

రాత్రి రెండు గంటలకు ముహూర్తం.

ఉదయం విడిదిలో స్నాతకం జరుగుతోంది.

వూళ్ళో పెద్దలందరూ వచ్చారు. ఆడ పెళ్ళివారి బంధువు లందరూ విడిదిలోకి వచ్చారు స్నాతకం చూడడానికి.

స్నాతకం అయింది.

బ్రహ్మచారి కాశీయాత్రకు బయలుదేరాడు.

"మా అమ్మాయిని నీ కిచ్చి పెళ్ళి చేస్తాం. కాశీ వెళ్ళ వద్దు. రా"మ్మని చెప్పించారు గడ్డం క్రింద బెల్లం ముక్క కొట్టించి, ఖరీదైన సూటు ఇచ్చి వరుని బావమరిదిచేత. ఆ అబ్బాయి పదవ తరగతి చదువు తున్నాడు.

"ఆ మాటలో మాటగానే పదిహేను వేలు ఇస్తాం అని కూడా చెప్పమ్మా" అంది శ్రీలక్ష్మి అందరికీ వినపడేలాగ.

ఆ అబ్బాయి పరుగెత్తుకు వెళ్ళిపోయాడు, సిగ్గు పడుతూ.

శ్యామల ప్రశ్నార్థకంగా జనార్దనం వంక చూసింది.

"నలుగురిలో గొప్పగా చెప్పుకుంటూందిలే. అదొక రకం వేళాకోళం" అన్నాడు జనార్దనం, ఆమెకే వినపడేలాగ.

సాయంత్రం జనార్దనం దంపతులచేత అంకు రార్పణ చేయించే ప్రయత్నంలో ఉన్నారు బ్రహ్మ గారు. ఆ సమయంలో గోవిందరావు వచ్చాడు.



## నవంబరు 3 నుంచి క్లాసులు ప్రారంభం.!

## 1981 ఫిబ్రవరి 21, 22 తేదీలలో

6 వ తరగతి లోనికి ప్రవేశ పరీక్షలు జరుగును.

## సైనిక స్కూలు, కోరుకొండ (ఎ. పి.)

* బాలుర వయస్సు 1981 జూలై 1వ తేది నాటికి 10-12 సం॥ల మధ్య నుండవలెను. డిఫెన్సులోని ఎక్సుసర్వీసు ఉద్యోగుల, సర్వీసు ఉద్యోగుల పిల్లలకు మరియు షెడ్యూలు కులముల వారికి ప్రత్యేక రిజర్వేషన్లు కలవు.

* కోరుకొండ సైనిక స్కూలుతో సమానముగా ప్రారంభించి, చక్కటి హాస్టల్ వసతితో పై పరీక్షలకు ఇంగ్లీషు మరియు తెలుగు మీడియంలో శిక్షణ నిచ్చుటలో పేరెన్నికగన్న దక్షిణ భారతదేశమునందలి ప్రప్రథమ విద్యాసంస్థ

ఫోన్ : 22084



## శ్రీ విద్యా విహార్

“ఆదర్శ గురుకుల విద్యాసంస్థ”

లలితానంద నగర్, రింగ్ రోడ్,

గుంటూరు-522 006.

ప్రతి సంవత్సరం అత్యుత్తమ ఫలితాలకు, సైనిక స్కూలులో చదువు వందలాది మా విద్యార్థులే మీకు నిదర్శనం

ఇంగ్లీషు, తెలుగు మీడియంలలో నర్సరీ నుండి 7 వ తరగతి వరకు క్లాసులు కలవు.

SAVITA


“బావగారూ! ఒక్క మాట” అంటూ వంటసాల పక్కనున్న సామాను గదివైపు దారి తీశాడు.

ఆయన వచ్చాడంటే, అందులోనూ ఏదైనా మాట్లాడాలని వచ్చాడంటే ఎటువంటి లిటిగేషన్‌లో పెడతాడో, ఏ మాట అంటే ఏ అర్థం తీస్తాడో అని జనార్దనం ఏమీ మాట్లాడకుండా ఆయన ఎదుట నిలబడి ఉన్నాడు.

“కట్నం సొమ్ము ముందుగా ఇస్తేనే కాని తరవాతి తంతు జరగడానికి వీలులేదు” అన్నాడు గోవిందరావు.

“అయ్యో! దానికేం? మీకు ఇవ్వవలసిన రెండు వేలూ సుముహూర్తం లోపున ఇవ్వడానికి సిద్ధంగానే ఉన్నాం. ఈ అంకురార్పణం కాగానే తీసుకువచ్చి ఇస్తాను” అన్నాడు జనార్దనం.

“లోగడ అనుకున్నట్లు కట్నం పదివేలు కాదు. పదిహేను వేలు. కాశీ ప్రయాణం వేళ మీ అబ్బాయితో అనడం జ్ఞాపకం లేదూ? ‘మా అక్కతో బాటు పదిహేనువేలు కూడా ఇస్తాం’ అని చెప్పమంది కదా?” అన్నాడు గోవిందరావు.

ఇలాంటి తంపి ఏదో పెట్టడానికే వచ్చి ఉంటాడనుకుంటూనే ఉన్నాడు జనార్దనం.

“మా చెల్లెలు అనడం విన్నాను. చిన్నప్పటి నుండి దానికి వేళాకోళాలు జాస్తి! అందులోనూ పెళ్ళిళ్ళవంటి సందడి సమయాల్లో దాన్ని పట్టుకోలేం. అంత సరదా మనిషి. అందువల్ల అది అన్న మాట నిజంగా అన్న దనుకోలేదు” అన్నాడు జనార్దనం.

“అది వేళాకోళం మనిషి అన్నది రైటే. కాని, డబ్బుదగ్గర వేళాకోళా లేమిటండోయ్? మీ చెల్లెలే చెప్పి రమ్మంది. ఖచ్చితంగా పదిహేను వేలూ ఇవ్వవలసిందే” అన్నాడు గోవిందరావు.

“అంటే, తాంబూలాలు పుచ్చుకున్నప్పుడు పెద్దల సమక్షంలో నిర్ణయించుకున్న పదివేలకు అయిదు వేలు చేర్చారన్న మాట! మీకు ఇచ్చిన ఎనిమిది వేలూకాక ఏడు వే లివ్వాలని తేల్చారా?” అడిగాడు జనార్దనం.

“ఏడు వేలు కాదు. మొత్తం పదిహేను వేలూ ఇప్పుడే ఇయ్యాలి. ముందుగా మీరు ఇచ్చిన ఎనిమిది వేలూ ఖర్చయిపోయాయి. ఆ సొమ్ముకు ప్రోనోటు వ్రాసి ఇస్తాను” అన్నాడు గోవిందరావు.

అబ్బ! ఎంత ఎత్తుమీద వచ్చాడు! ముహూర్తం సమీపిస్తున్న సమయంలో ఏమి టీ తిప్పలు పెట్టడం?

జనార్దనం తల తిరిగిపోతూంది.

పెళ్ళికని ఎంత సొమ్ము సిద్ధం చేసుకున్నా పెళ్ళి వారికి ఇవ్వవలసినది రెండు వేలు కదా? ఇక పెళ్ళి ఖర్చు కదా? అనుకున్నాడు. ఖర్చుకు ఉంచిన సొమ్ములో ఏడు వేలు ఇస్తామన్నా కాదంటున్నాడు! ఉన్నఫళంగా పదిహేను వేలు అక్కడ పెట్టమంటే ఎలా? ఏం చెయ్యడం? ఎవరి నడగడం? ఇప్పు డివ్వకపోతే పెళ్ళి జరగడానికి వీల్లేదంటున్నాడు. నడి వీధిలో అల్లరి పాలు చేసేటట్టున్నాడు.

జనార్దనం మస్తిష్కం పనిచెయ్యడం మానేసింది.

అంకురార్పణకు వేళ మించిపోతూందంటూ భార్య శ్యామల, బ్రహ్మ రామశాస్త్రిగారు ఆటుగా వచ్చారు.

“ఏం మాట్లాడరేం, బావగారూ? పదిహేను

వేలకు పావలా అయినా తగ్గకుండా ఇచ్చేస్తేనే వివాహం జరగడం? మీకు బోలెడు పనులు ఉంటాయి." అంటూ తొందర చేస్తున్నాడు గోవిందరావు.

అతని కెదురుగా మాటా మంతీ లేకుండా శిలా ప్రతిమలాగ నిలబడి ఉన్న జనార్దనాన్ని చూశారు.

విషయం అర్థమైంది.

"ఏమండీ!" అన్న భార్య పిలుపుతో తల ఎత్తి చూశాడు జనార్దనం.

బ్రహ్మగారినీ చూశాడు.

అతని కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగింది.

గోవిందరావు చెబుతున్న విషయం వారితో చెప్పాడు.

శ్యామల పరుగున లోపలికి వెళ్ళి తల్లితండ్రుల తోనూ, జనార్దనం మేనమామతోనూ చెప్పింది.

"లగ్నం జరిగిపోనివ్వండి. రాత్రి వేళ ఇంత సొమ్ము సమకూర్చడం కష్టం. మాకు మోతుబరి స్నేహితులు ఉన్నారు. బాంకులో కాతా లుంటాయి వారికి. తెల్ల వారాక వాళ్ళ నడిగి తెచ్చి ఇస్తాం" అని బ్రతిమాలు కున్నారు వాళ్ళందరూ వచ్చి.

ససేమిరా అన్నాడు గోవిందరావు.

"ఉదయం స్నాతకం వేళ అనగా చెబితే పగలల్లా ఏం చేస్తున్నారు? ఇప్పుడు రాత్రి అయిందని వంక. పెళ్ళయిపోతే ఇక ఇవ్వక్కర్లేదని మీ ఎత్తు. నా కర్థమైంది. ఆఖరిసారిగా చెబుతున్నాను. పదిహేను వేలు రొక్కం పట్టుకువచ్చి ఇస్తేనే మీ అమ్మాయి మెడలో మూడు ముళ్ళూ పడ్డం" అంటూ భుజం మీద కండువా గట్టిగా దులిపి, మళ్ళీ వేసుకుని పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ విడిదిలోకి వెళ్ళి పోయాడు.

"ఇదేమిటి- కూరల బేరం లాగ పావలా తగ్గిం అనడం! పైగా ముందిచ్చిన ఎనిమిది వేలకు నోటు వ్రాస్తాడట! అంటే, కన్న బిడ్డను ఇచ్చినప్పుడు ఆ వ్యక్తుల మీద వ్యాజ్యం వేసే వారెవరూ ఉండరు. అందువల్ల డబ్బు మాట అలాగ ఉంచి పిల్ల జీవితం నరకప్రాయం అవుతుందని భయంకదా! అందుకే ఆ ఎత్తు ఎత్తాడు గోవిందరావు. ఆ ఎనిమిది వేలూ కూడా స్వాహా చేసే ఉద్దేశమే" అన్నారు విన్నవా ళ్ళందరూ.

ఈ సమయంలో వాళ్ళు అన్న ప్రకారం ఇవ్వక పోతే పెళ్ళికి అంతరాయం తప్పదు. ఎంతో మంచిది అనుకున్న శ్రీలక్ష్మి చాలా ఘటికురాలని తేలింది. భర్త ఆమె చేతిలో కీలుబొమ్మ. అలాంటప్పుడు పిల్లలేం చెయ్యగలరు? పెళ్ళి ఆగిపోతే మగపిల్ల వాడికి ఫరవాలేదు. అపఖ్యాతి రాదు. కాని, ఆడపిల్ల మనస్సుకు ఆఘాతం. పీటల మీద పెళ్ళి చెడిపోయిం దంటే సంఘంలో అనేక రకాల వూహాగానాలు బయలుదేరతాయి. నిందలు వేస్తుంది లోకం. ఉన్నవీ, లేనివీ చిలవలు పలవలుగా అల్లేస్తుంది. ఎక్కడో అక్కడ ఆ సొమ్ము తెచ్చి లగ్నం జరిపించడం శ్రేయస్కరం అన్న నిర్ణయానికి వచ్చారు పిల్ల తరపు వాళ్ళు.

జనార్దనం మంచితనం వల్ల అందరూ అతనంటే అభిమానులే. ఆ వూళ్ళోని క్షత్రియులు, కమ్మ వారిలో అతనికి మిత్రులు ఉన్నారు. వారు వాళ్ళ వాళ్ళ దగ్గర ఉన్న సొమ్ము అప్పటి కప్పుడు తెచ్చి ఇచ్చారు. పెళ్ళివారి గొడవలు చూసి శ్రీలక్ష్మి, గోవిందరావులకు పెద్దల సమక్షంలో ఆ సొమ్ము ఇచ్చారు. అంతవరకు పెళ్ళివారు భోజనాలకు లేవలేదు.

విడిదిలో ఉన్నవారిని భోజనానికి పిలవడానికి వెళ్ళింది శ్యామల. అందరినీ బొట్టు పెట్టి పిలిచింది. ఒక గది తలుపు దగ్గరగా వేసి ఉంది. నెమ్మదిగా తోసింది తలుపు ఆమె, ఎవరైనా ఉన్నారేమో పిలుద్దామని.

"ఎవరది? గెటౌట్. బుద్ధిలేదూ? బట్ట కట్టుకుంటూంటే ..." అరిచినంతగా అంది లోని వ్యక్తి.

"తలుపు గడియ లేదని తోశానమ్మా. వంట లయాయి. భోజనానికి రండి" అని శ్యామల అంటూండగా అర్ధోక్తిలోనే — "ఐ సే యూ గెటౌట్!" అని అరిచింది.

శ్యామల ముఖం మీదే భళ్ళున తలుపు వేసింది లోపలి వ్యక్తి.

ఆమె పెళ్ళి కుమారుని అక్కగారట. భర్తతో అమెరికా వెళ్ళి ఆరు మాసాలు ఉన్నదట. అదీ ఆమె ఘనత.

పక్క గదిలో ఆమె భర్త తప్పతాగి నేల మీద దొర్లుతున్నాడు. ఒళ్ళు తెలియకుండా పేలుతున్నాడు- పెళ్ళివారు ... ఫలహారాలు అంటూ.

వచ్చినప్పటి నుండి పెళ్ళివారి కేమీ వచ్చలేదు. అన్నిటికీ వంకలే. కొత్త ఇల్లు విడిది ఇస్తే ఒకటే చిదరింపు! ఆ ఇంటి వారు వాళ్ళను వెళ్ళిపొమ్మ న్నారు. ఎవ్వరూ విడిది ఇవ్వ మన్నారు. ఎలాగో ఇది వరకు ఇచ్చిన వారినే బ్రతిమాలాడు జనార్దనం




చూడండి...
సర్వోత్తమ
తెలుపుకోసం
రానిపాల్®

బట్టలను ఆఖరుసారి జాడించునపుడు కొంచెము రానిపాల్ వేయండి. అపుడు చూడండి...బట్టలపై మెరిసే తెలుపు! రానిపాల్ తెలుపు! తెల్లటి బట్టలు ఏవైనా, కాని—నూలు, సింథెటిక్ మరియు మిశ్రమ బట్టలు రానిపాల్ తో మెరుస్తూ వుంటాయి.

నియమానుసారంగా
రానిపాల్ ను వేయండి...
తెలుపు చూడండి. చూపండి!




నూలు దుస్తులకు
రానిపాల్®
సింథెటిక్ మరియు మిశ్రమ దుస్తులకు
రానిపాల్® ఎస్

Shilpi SG-2A/78 Tel.

"ఎన్నో శుభకార్యాలు నా చేతి మీదుగా చేయించాను. ఇంత పేచీకోరుల నెక్కడా చూడలేదు. మాట నిలకడ లేదు. మాటకు విలువ లేదు. మర్యాద లేదు. ఈ పెళ్ళి జరిపించడానికి నాకు మనస్కరించడంలేదు. మరెవరినైనా పిలుచుకోండి" అని పురోహితుడు రామశాస్త్రి వెళ్ళిపోయాడు. ఆయన బాగా చదువుకున్న వాడు- మంచి మనిషి.

రాత్రి పదిగంటలైంది.

సంభావనలకు వచ్చిన వారిలో ఒక పెద్దాయనను పురోహితుడుగా ఏర్పాటు చేశారు ఆడ పెళ్ళి వారు.

పెట్టే పేచీలు పెట్టి, పదిహేను వేలూ చేతిలో పడ్డాక భోజనాలకు వచ్చారు మగపెళ్ళివారు. ఆడ పెళ్ళి వారి ముఖాన ఆనందం కన్న బెదురు ఎక్కువగా కనపడుతూంది. ఏ నిమిషాని కే బెడద ఎదుర్కోవలసి వస్తుందోనని హడలిపోతున్నారు.

* * *

వధువు సుగుణ మనస్సు మనస్సులో లేదు. మాటి మాటికీ దుఃఖం వస్తూంది. తనకు భవిష్యత్తు ఉందా ఈ పెళ్ళి జరిగితే అన్న సందేహం పెద్ద క్వశ్చన్‌మార్కు అయి కళ్ళ ఎదుట భయంకరంగా నిలిచింది.

మెరుపు లాగ ఒక ఆలోచన వచ్చింది.

తన వాళ్ళు పడ్డనలో ఉన్నారు. పెళ్ళి కుమారుడు మురళి విడిదిలోనే ఉంటాడు, పెళ్ళికి తరలి వచ్చే దాకా. అందువల్ల అతనిని ఎలాగైనా కలుసుకోవాలి అన్న నిర్ణయానికి వచ్చింది. చివాలున లేచింది.

పక్క ఇల్లే విడిది. రెండిళ్ళ మధ్యా గుమ్మం ఉంది.

విడిదిలోకి వెళ్ళింది.

అన్ని గదులూ గొళ్ళెం పెట్టి ఉన్నాయి. ఒక గదిలో మాత్రం దీపం వెలుగుతూంది. తలుపు ఓరగా వేసి ఉంది. నెమ్మదిగా తలుపు తోసింది సుగుణ. మురళి మంచం మీద పడుకుని ఇంటి కప్పు కేసి చూస్తున్నాడు. తలుపు చప్పుడుతో చివాలున తల తిప్పి చూశాడు. ముఖాన కల్యాణం బొట్టుతో, బుగ్గను చుక్కతో, పట్టుచీరతో సుగుణ!

"సుగుణా!" అన్నాడు లేచి దగ్గరగా వచ్చి.

ఆమె కళ్ళు ఎర్రగా వాచి ఉన్నాయి. చెంపల మీదుగా జాలువారుతున్న నీళ్ళు చూసి తుళ్ళి పడ్డాడు.

"ఏడుస్తున్నావా?" అన్నాడు.

"ఏడుపు కాక మరేమిటి, బావా? నిమిషాని కొక రకంగా అత్తయ్య పేచీలు. ఆవిడ ఎలా అనుమంటే అలాగ అంటున్నారు మామయ్య. ఈ సంసారంలో నేను నిలదొక్కుకుని కాపరం చెయ్యగల ననే నమ్మకం లేదు. అన్నీ చూస్తూ, నువ్వు పన్నెత్తి మాట్లాడవు. నీకు పట్టనట్లుండడంలో నీ ఉద్దేశం ఏమిటి? నీకూ వాళ్ళంటున్న వన్నీ అంగీకారమేనా? ఈ పెళ్ళి జరిగితే నా కిక చరమ దశే" అంటూ వెక్కి వెక్కి ఏడ్చింది సుగుణ.

ఉదయం నుండి జరుగుతున్న రభసకు మురళి ముఖం వన్నె తరిగే ఉంది. ఇప్పుడు పెళ్ళి కుమార్తె సుగుణ కన్నీళ్ళతో నిలదీసి అడుగుతూంటే అతనికి దుఃఖం పెల్లుబికి వచ్చింది. అయినా, నిగ్రహించుకున్నాడు.

సుగుణ కన్నీరు తుడిచాడు.

"జరుగుతున్న విషయాలన్నీ చూస్తున్నాను. వింటున్నాను. పదిహేను వేల రొక్కం మీ వాళ్ళ దగ్గిర పుచ్చుకున్నారు. ఇందులో ఒక వ్యవహారం ఇమిడి ఉంది. మా నాన్న నా చేత నా చదువు నిమిత్తం అప్పు ఇచ్చినట్లు ఇరవై అయిదు వేలకు నోటు వ్రాయించుకున్నాడు. మా తమ్ముడు ఎమ్. బి. బి.ఎస్. చదువుతున్నాడు. వాడిచేతా అలాగే వ్రాయించుకున్నాడు. ముందు ముందు మేము కట్నాలు వద్దంటామేమో అని భయం. ఆ సొమ్ము కట్నాల ద్వారా రాబట్టాలని ప్లాను. ముందు కాళ్ళకు బంధాలు వేశాడు. దానికి మా అమ్మ ప్రోద్బలమే కారణం.

"నాలుగు రోజులే ఉంది సెలవు నాకు. గృహ ప్రవేశం కాగానే మనం కలకత్తా వెళ్ళిపోతాం కదా? వాళ్ళ వల్ల ఏ బాధలూ ఉండవు" అన్నాడు మురళి.

"అవునూ, పిల్లలకు చదువు చెప్పించడం తండ్రి విధి కాదా? పైగా మీకు ఆస్తిలో వాటా ఉంటుందాయె. ఇక అప్పేమిటి చదువు కోసం? ఇదేం న్యాయం?" ఆశ్చర్యంగా అడిగింది సుగుణ.

"విధి, న్యాయం అన్నవి ఆయా వ్యక్తుల మన స్తత్త్వాలనుబట్టి ఉంటాయి. కొడుకులకు తప్పకుండా చదువు చెప్పించాలి అన్న విషయం 'లా' లో లేదు. డబ్బు లేక చెప్పించలేకపోవచ్చు. డబ్బు ఉన్నా, తెలివిగా చదువుకుంటున్నా, ఇష్టంలేక చదువులు సాగనియ్యని తండ్రు లెందరో ఉన్నారు. ఆ పరిస్థితిలో ఇదేం న్యాయం? అని కోర్టు కెక్కి అడిగే హక్కు లేదు. నాకు ఆస్తిలో హక్కున్న మాట నిజమే. అది ఎవ్వరూ కాదనరు. ఇది లా" అన్నాడు మురళి.

"ఇదెక్కడి 'లా', భగవంతుడా!" అంది సుగుణ విస్తుపోతూ.

"యజమాని తన తలిదండ్రులను, భార్యను, మైనరు కొడుకులను, పెళ్ళికాని ఆడపిల్లలను అన్న వస్త్రాలిచ్చి పోషించాలి. అంతవరకే 'లా' ప్రకారం పూచీ ఉంది. ఆ విషయంలో ఎవరిని సరిగా చూడక పోయినా, వారు కోర్టుకు వెళ్ళినట్లైతే వాళ్ళకు న్యాయం జరుగుతుంది అని 'లా'లో ఉంది. అంతేకాని, చదువులు, పెళ్ళిళ్ళ విషయంలో యజమాని దయాదాక్షిణ్యాలపై ఆధారపడవలసి ఉంది. 'లా' అంటే అలాగ ఉంటుంది. అందుకే 'లా ఇజ్ ఏస్ ఏస్ అండ్ ఏన్ ఇడియట్' అన్నాడు డికెన్స్.

"ఇంతకూ మీ వాళ్ళిచ్చిన సొమ్ము నెల నెలా నీ పేర బాంక్‌లో వేస్తాను. ముందు ఇచ్చిన ఎనిమిది వేలూ మీ మేనమామగారి పేర వ్రాయించారు మా నాన్నచేత. మంచిపని చేశారు మీ వాళ్ళు. ఆ సొమ్ము మనం వెళ్ళగానే పంపేద్దాం. నువ్వేం కంగారు పడకు. ఈ నాలుగు రోజులూ ఏమీ మాట్లాడకు. మనం ఎలాగా వెళ్ళిపోతాం. 'నువ్వు నిశ్చింతగా ఉండు'" అంటూ కన్నీట తడిసిన ఆమె చెంపలను రుమాలుతో తుడిచి ఓదార్చాడు మురళి.

అతని మాటలతో మనసుకు ఊరట కలిగింది సుగుణకు.

"నీ మాట ఆధారంగా నేను పెళ్ళి కంగీకరిస్తున్నాను. నీ మాట నమ్మకమేనా? ఏదీ—ప్రామిస్" అంటూ కుడి చెయ్యి చాపింది.

"ప్రామిస్!" అంటూ ఆమె చేతిలో తన చేయి వేశాడు మురళి.

★


## మీకుపయోగించేది

ఇంట్లో ఎవరికేరోగంవచ్చినా కంగారు పడేపనిలేదు. ఐదురకాల ప్రఖ్యాతవైద్యులు ప్రతిరోగానికి, రోగలక్షణాలు, వాటి నివారణకు ఇంగ్లీషు, ఆయుర్వేద, ప్రకృతి, మూలిక, హోమియో మందులు, "ఐదువైద్యవిధానాలు" అనే తెలుగు పుస్తకంలో అందరికి తెలిసేలా వ్రాశారు. అన్ని షాపుల్లోదొరికేమందులే. 427 రోగాలునయము చేసుకొనేమార్గాలున్నాయి. వెలరూ. 16. పోస్టు ఖర్చులదనం. దేశసేవప్రచురణాలు, 6/3 ఆర్‌టి. పంజాగుట్టకాలని, హైదరాబాదు-4 కు, మాకో పుస్తకం వి.పి.పోస్టులోపంపుమని వెంటనేవ్రాయండి.

## మూలశంకకు

త్వరగా

నమ్మకమైన

హెడన్‌సా

విరేచనముతో

చికిత్సను పొందండి

- శస్త్రచికిత్స

అవసరములేదు!

మీకు బేబి/బాబు కావాలా



ఆపరేషన్, ఇతర వైద్య చికిత్సలతో నిరాశ చెందిన ... అనేకులు మా సలహాలతో సంతానవతులయిరి. ఇప్పుడు సౌభాగ్యవతులై ... పురుష సంతానలేమి ... రణ నిపుణులు.

శ్రీ నాగార్జునమూలికకుటీరం

రల్వే స్టేషన్ వద్ద, రామాలయం వీధి,

తెనాలి - 2